# ప్రవృత్తి

మేనేజర్‌పురుషోత్తమరావిచ్చిన బ్రీఫ్‌కేస్‌ని అందుకుని బల్లమీద పెట్టి, మూత తెరిచాడు ఉపేంద్రరావు. పెట్టెలో వంద, వంద రూపాయల కట్టలు పది ఉన్నాయి. ఒక్కోకట్టలో వెయ్యేసి రూపాయల చొప్పున కట్టి వున్నాయి. డబ్బంతా లెక్క చూసుకుని పురుషోత్తమ రావిచ్చిన పాస్ బుక్‌ని, ఆ డబ్బుకి సంబంధించిన పేపర్లని ఓ బేగ్‌లో పెట్టుకుని, పెట్టె తాళం వేసి ఓ నిమిషం నిలబడి ఎదోచెప్పబోయి మళ్ళీ బ్రీఫ్‌కేస్ అందుకున్నాడు. తలెత్తి చూసిన పురుషోత్తమరావుకి అతని తటపటాయింపుకి కారణం అర్థం కాక 'ఏమి' టన్నట్లు కనుబొమ్మలతోటే అతన్ని ప్రశ్నించాడు.

"సార్ ఇంత డబ్బుని ఆటోలోగాని, బస్‌లోగాని తీసుకెళ్ళాలంటే భయంగా వుందండీ ఆఫీస్ కార్ ఇస్తే..." అంటూ నసుగుతూ, భయం, భయంగా చెప్పబోతున్న అతన్ని మధ్యలోనే ఆపి...

"కారు లేదోయ్ మన డి.జి. తీసుకెళ్లాడు కావాలంటే నా స్కూటర్ తీసుకెళ్ళు" అంటూ తాళాలు జేబులోంచి తీసి ఇచ్చి, టైము చూసి "త్వరగా వెళ్ళాలోయ్ అప్పుడే టైము పదకొండు దాటిపోయింది. నువ్వు చాందిని చౌక్ వెళ్ళడానికి చాలా టైము పడుతుంది. ఈ రోజు ఈ డబ్బు కట్టెయ్యాలి" అంటూ అతన్ని తొందర చెయ్యడంతో ఉపేంద్రరావు తాళాలందుకొని పెట్టెతో సహా గబగబా బైటికొచ్చేసాడు.

ఉపేంద్రరావు బి.కాం, పాసయిన అయిదేళ్ళకి తల్లిదండ్రులు తపస్సు చెయ్యగా, చెయ్యగా ఈ కంపెనీలో క్యాషియర్ ఉద్యోగం దొరికింది. ఉద్యోగంలో చేరి నెల్లాళ్లే దాటింది. మొదటినెల జీతమందుకుని తల్లిదండ్రులకిచ్చిన రోజున వారి ఆనందానికి అవధులులేకపోయాయి. "ఏనాడయినా నేను ఉద్యోగంచేసి నా వాళ్ళకి కడుపునిండా అన్నం పెట్టి వాళ్ళ కష్టాలని గట్టెక్కిస్తానా?" అని ఎదురు చూసిన ఉపేంద్రరావు, కొడుకుని ప్రయోజకుడిని చెయ్యాలన్న తాపత్రయంతో ఉన్నదంతా ఊడ్చి, దరిద్రాన్ని ఒడిగట్టుకుని చదివించిన కొడుకు "ఏనాడు ఉద్యోగం చేసి నాలుగురాళ్ళు తెస్తాడా? అని కళ్ళలో ఒత్తులేసుకుని ఎదురు చూసిన ఆ తల్లిదండ్రులకి ఆ

ఫస్టుతారీకు పర్వదివంకాక మరేమవుతుంది.

ఉపేంద్రరావు స్వభావికంగా నెమ్మదస్తుడు. భయస్తుడు. అతను చేస్తున్న ఉద్యోగం అతని మనస్తత్వానికి పరీక్షాపత్రం వంటిది. నిత్యం డబ్బుతోటే అతని వ్యవహారం. అది మరీ అంత పెద్ద కంపెనీకాదు. అలాగని మరీచిన్నదీకాదు. ఆ కంపెనీలోని వ్యక్తుల మనస్తత్వాలు ఇంకా అవగాహన కాలేదు ఉపేంద్రరావుకి. డబ్బుతో నిత్యం వ్యవహరించవలసి రావడంతో అతని మెదడు వేడెక్కిపోయి తోటివారితో ఎక్కువగా కలిసి తిరగలేకపోయేవాడు. ఆఫీసు టైమయిపోగానే లెక్కలు చూసి తాళాలు మేనేజర్ చేతిలో పెట్టగానే అతనికి మనస్తిమితం చిక్కేది.

డబ్బుతో వ్యవహరించే ఉద్యోగమవడం వల్లనో, స్వభావికంగా భయస్తుడు కావడం వల్లనో అతను ఆఫీసులో ఉన్నంత సేపూ టెన్షన్‌తో ఊపిరాడనట్లే కనబడేవాడు. తోటి ఉద్యోగులంతా ఇతన్ని చూసి నవ్వుకోవడమే కాకుండా ఎదురుగానే వెటకారమాడేవారు. "దొరక్కదొరక్క దొరికిన ఉద్యోగంకదురా! అందుకు ఇంత భయభక్తులతో చేస్తున్నా"డని వేళాకోళ మ్మాడేవారు. వారన్న మాటల్లో యదార్థం కూడా ఉండటంవల్ల ఉపేంద్రరావు వారి మాటల్ని పట్టించుకోకుండా, వినీవిననట్లు వెళ్ళిపోయేవాడు.

తాళాలు తీసుకుని క్రిందికొచ్చిన ఉపేంద్రరావు స్కూటర్ దగ్గరకొచ్చి స్కూటర్ స్టార్టు చెయ్యబోయాడు టక్కున క్లచ్‌వైరు తెగిపోయింది. ఉసూరుమంటూ తాళాలు తీసి జేబులో వేసుకుని, గడియారంవైపు చూసి ఇక తప్పదన్నట్లుగా ఆటోస్టాండు వైపుకి గబగబా నడిచాడు. ఆటోస్టాండ్‌లో ఒక్క ఆటో కూడా లేదు. రెండు నిమిషాలపాటు నిలబడి, ఖాళీగా వెళ్తున్న ఆటోనల్లా ఆపమని చెయ్యి చూపించినా ఒక్కడూ ఆపకుండా వెళ్ళిపోయాడు. ఇంతలో బస్‌స్టాండులోకి చాందినిచౌక్‌కు వెళ్ళే బస్ రావడంతో పరిగెత్తుకుని వెళ్ళి ఆ బస్సు ఎక్కేసాడు. బస్‌లోపలికి అడుగు పెట్టిన అతన్ని వెనకజనం లోపలిదాకా నెట్టుకుంటూపోయారు. జనం మధ్య నలిగిపోతున్నాడు. ఎంత చోటు చేసుకుందామనుకున్నా కావటంలేదు. ఊపిరాడటమే కష్టంగా వుంది, ఆడా, మగ అన్న భేదం లేకుండా తోసేసుకొంటున్నారు. టికెట్టు తీసుకుందామనుకున్నా చోటివ్వడం లేదు, ఓచేతిలో బ్రీఫ్ కేసు, రెండో చేత్తో రాడ్ పట్టుకుని నిలబడాలని ప్రయత్నించి విఫలుడవుతున్నాడు. ఓ మూల

ట్రైమైపోతోందన్న ఖంగారు. ఓ ప్రక్క ఇంత డబ్బుతో ఈ తొక్కిసలాడుతున్న బస్సులో ప్రయాణం చేస్తున్నానన్న ఖంగారు, భయంతో అతనికి చెమటలు పట్టసాగాయి. రానురాను జనం ఎక్కేవాళ్ళ సంఖ్యే ఎక్కువవుతోంది.

ఇంక ఎదర రెండో స్టాపులోనే తను దిగవలసింది. నెమ్మదిగా ఎదరవాళ్ళని నెట్టుకుంటూ తలుపు దగ్గరకెళ్ళడానికి ప్రయత్నిస్తున్నాడు. అతికష్టంమీద ఎదర తలుపు దగ్గరకి చేరగలిగాడు. అప్పుడే ఆగిన ఆ స్టాపులోంచి బస్సు నెమ్మదిగా కదలబోతోంది. రెప్పపాటులో ఉపేంద్ర చేతిలోని బ్రీఫ్‌కేస్ లాక్కొని ఒక్కదూకులో బస్సు దూకి అడ్డంగా పరిగెత్తుకెళ్ళిపోయాడు అతనికి ముందుగా నిలబడ్డ ఓవ్యక్తి.

ఉపేంద్రరావు తేరుకుని గట్టిగా అరిచి, గోలపెట్టిన కొద్దినిమిషాలకి బస్సు అపగా ఉపేంద్రరావు దిగి వెనక్కి పరిగెత్తాడు.

"చోర్, చోర్, పకడో, పకడో" అంటూ కేకలెడుతూ వెర్రివాడిలా అటూ ఇటూ పరిగెడుతూ అరవసాగాడు.

అప్పటికే ఏ సందులోకో మాయమైన ఆ దొంగని ఎన్ని కేకలేసి, అరచి మాత్రం ఎవరు పట్టుకోగలరు? రెండుమూడు గంటలు వెర్రివాడిలా అటూ ఇటూ తిరిగి ఆఖరికి నిరాశా, నిస్పృహతో మళ్ళీ బస్‌స్టాప్ వైపుకే తిరిగి వచ్చాడు.

"నీవు చెప్పిన కథంతా విన్నాను. దానికి సాక్ష్యాలేవీ? నువ్వు ఎక్కిన బస్సు నంబరు నోట్ చేసావా?"

"................."

"పోలీస్ రిపోర్టన్నా వెంటనే ఇచ్చారా?"

"................"

"ఇప్పుడు, ఇంతసేపటి తరువాత ఏం ఆధారాలు చూపించి నమ్మిస్తావు? 'బస్సు ఎక్కాను. తలుపుదగ్గర నిలబడితే ఎవడో లాక్కుపోయాడు నా బ్రీఫ్‌కేస్' అంటే. 'అంత డబ్బున్నప్పుడు కేర్‌లెస్‌గా ఎందుకు నిలబడ్డా'వని అడిగితే ఏం చెప్తావు? అసలది బస్సులో కొట్టేసారని నమ్మకమేమిటి? నువ్వే కొట్టేసి పోయిందనొచ్చుగా...? అయినా స్కూటర్ క్లచ్‌వైర్ తెగిపోయిందని వొచ్చి చెప్తే నేను మరెవరిదేనా స్కూటర్ ఇప్పిద్దును కదా? లేదా మరొకర్ని తోడిచ్చి టేక్సీలో

పంపేవాడినికదా?"

"..............."

"చూడు మిస్టర్! ఇది ఆఫీసు డబ్బు అది ఈ రోజు బ్యాంకిలో జమ కాకపోతే ఎన్నివిధాల, ఎంత నష్టం జరుగుతుందో నీకేంతెలుసు. దానికంతటికీ నువ్వే బాధ్యుడివి.

"నష్టాన్ని భరించడమేకాకుండా, ఆ డబ్బంతా వెంటనే తెచ్చి ఆఫీసుకి అప్పచెప్పాలి. తెల్సా?

"నెలాఖర్లోగా ఆ పని జరగక్కపోతే ఉద్యోగం ఊడుతుంది. పోలీస్ ఎంక్వయిరీ పెట్టించాల్సి వస్తుంది. బాగా ఆలోచించుకో, పిట్ట కథలుమాని డబ్బు తెచ్చి మర్యాదగా కట్టెయ్యి" అంటూ గట్టిగా చెప్పి వెళ్ళిపోయాడు మేనేజర్.

ఆఫీసులో నలుగుర్లో జరిగిన ఈ అవమానంతో ఉపేంద్రరావుకి తల కొట్టేసినట్లయింది. మెదడులో నరాలన్నీ వేడెక్కి చుట్టుకుపోతున్నాయి. శరీరంలోని రక్తం కుత కుతా ఉడుకుతోంది. ఓ పక్క నీలాపనింద, మరో పక్క ఎన్నో ఇబ్బందుల్నీ, కష్టాలని ఎదుర్కొని సంపాదించిన ఉద్యోగం కాస్తాపోతోందన్నదిగులు. 'ఏలాగేనా కష్టపడి ఆపదివేలూ తెచ్చికట్టేసి ఉద్యోగాన్ని నిలబెట్టుకుందామన్నా ఇంట్లో పదివేలు కాదుకదాపదిరూపాయలు కూడా లేవు. ఇంట్లో తల్లి మెడలో రావి ఆకుపుసైతప్ప బంగారమన్నది లేదు. ఉన్న ఆస్తి అంతా అమ్మి ఆడపిల్లలిద్దర్నీ ఓ ఇంటివాళ్ళని చేసి, తనని చదివించి ఇంకా అప్పులపాలయ్యారు. అవన్నీ తెలిసి కూడా ఏ ముఖం పెట్టుకు తల్లిదండ్రుల్ని పదివేలిమ్మని అడగగలడు? తనకి తెలియందేముంది వాళ్ళదగ్గర? దురదృష్టం కాకపోతే తనంత తెలివితక్కువగా ఎలా ప్రవర్తించాడు? మేనేజర్ అడిగినవన్నీ కరక్టే! ఏ ఒక్క ప్రశ్నకీ జవాబివ్వలేక పోయాడు ఆటైములో ఏ ఆలోచనా రాలేదు. పిచ్చిగా అరిచి కేకలేసాడే తప్ప బస్ నెంబరు నోట్ చేసుకోవాలనిగానీ, పోలీస్ రిపోర్టివ్వాలని గానీ తోచలేదు. ఆ టైములో ఏం తోచక ఖంగారుపడి పరిగెడితే మాత్రం ప్రయోజనం ఏమిటి. రోడ్డుమీద జనం తన్నో వెర్రివాడిని చూసినట్లు చూసారు. మేనేజర్‌కి తనమీద అనుమానం కల్గింది. అందర్లో అవమానించాడు. పౌరుషం పొడుచుకొచ్చింది. అంతా అబద్ధమని అరవాలనుకున్నాడు. అరవలేకపోయాడు. మౌనంగా అన్నవన్నీ పడ్డాడు. తన

మౌనమే తననేరాన్ని రుజువుపరిచిందా? ఆఫీసులో అంతాకూడా తనని దొంగనుకుంటున్నారా? ఛి ఛీ ఏం బ్రతుకు ఎదుటివారికి ఎంతలోకువిస్తాయి ఈ బీదబ్రతుకులు - డబ్బున్న వాడికి అన్నీ కప్పడిపోతాయి. పదివేలంటే పది రూపాయలతో సమానం ఈ మేనేజర్‌లాంటి వాళ్ళకి, పదివేలంటే పదికోట్లతో సమానం తనవంటి బీదవారికి. ఉద్యోగం పోవడం ఖాయం, డబ్బు కట్టకపోతే తనమీద కేసూ, జైలు జీవితం కూడా తప్పదు. తన తల్లితండ్రులకీ సంగతి తెలిస్తే గుండెపగిలి చనిపోతారు. ఏం చెయ్యాలిప్పుడు? ఏం చెయ్యను?' అంటూ ఆలోచిస్తూ ఆఫీసు మెట్లుదిగి బైటికొచ్చి విజయ చౌక్‌వైపు నడుచుకుంటూ వెళ్ళసాగాడు. ఇండియాగేట్ దగ్గర ఓ నేరేడు చెట్టుక్రింద కూర్చున్నాడు ఇంటి కెళ్ళాలనిపించటంలేదు. కళ్ళెంలేని గుర్రంలా మనస్సు సరిపరివిధాలుగా పరిగెత్తసాగింది. తన్నింతగా అవమానించిన ఆ మేనేజర్ని చంపివస్తే బాగుండుననిపిస్తోంది. ఈ అపవాదుని భరించేకంటే తనే ఏ ఆత్మహత్యో చేసుకోకూడదూ?" అనిపించింది మరొకసారి. కానీ ముసలి తల్లితండ్రులు - తనమీదే ఎన్నో ఆశల్ని పెంచుకుని బ్రతుకుతున్న ఆ దంపతులు కళ్ళెదుట తిరగానే కళ్ళలో నీళ్ళు చిమ్మి షర్టుమీద టపటపా రాలాయి.

అలా ఆలోచిస్తూ ఎంతసేపు కూర్చున్నాడో తనకే తెలీదు. ఓ రబ్బరు బంతొచ్చి తలకి తగలగానే ఈ లోకంలోకొచ్చాడు. పరిసరాలను తిలకించిన ఉపేంద్రకి అక్కడి జనసమూహం కళ్ళబడింది. రంగు రంగుల చీరలతో, ఆధునాతనంగా అలంకరించుకున్న స్త్రీలు, వారి భర్తలూ, పిల్లలూ ఖరీదైన కార్లల్లోవచ్చి అక్కడ కూర్చుని ఐస్‌క్రీమ్‌లు, పాప్‌కారన్‌లు తింటూ కబుర్లు చెప్పుకుంటూ విహరిస్తూ కనపడ్డారు. వారిలో ప్రతీఒక్కరి ముఖాంలోనూ ఆనందమే చోటుచేసుకుంది. విచారమెరుగని పక్షుల్లా, సీతాకోక చిలకల్లా, అంతా తామేఅయి విహరిస్తున్నారు. "తనలాంటి నిర్భాగ్యజీవిరావలసిన చోటుకాదిది" అనుకున్నాడు మనస్సులోనే. వారిలో ఒక్కరైనా తనకో పదివేలు అప్పివ్వకూడదూ? పోనీ మనిషో రెండొందలిచ్చినా తనకీ అపనిందపోయి ఆ ఉద్యోగం దక్కుతుంది. అన్ని వందల మందిలో ఒక్కరైనా తనకి సహాయం చెయ్యకూడదూ? "ఎంత అమాయకత్వంరా వెర్రినాగన్నా" అని తన పిచ్చి ఆలోచన తనకే నవ్వొచ్చింది" ఇది కృత్రిమ ప్రపంచం - ఏది నిజం? ఏది అబద్ధం? న్యాయమెక్కడ? అన్యాయమెక్కడ? ఎలా తెలుస్తుంది? వ్యక్తుల

ముఖాలు చూసి చదవగలగడం సంభవమా? తను దొంగో, దొరో ఎవరికి తెల్సు. ఎలా వాళ్ళని నమ్మించగలడు నెలాళ్ళుగా దగ్గరుండి పనిచేస్తున్న మేనేజర్‌కే తన మీద నమ్మకం లేదు. ముక్కూ, ముఖం ఎరగని పైవాళ్లు ఏం నమ్మి తనకి ఇప్పిస్తారు? మేనేజర్ లాంటి వ్యక్తులు తనలాంటివారి కష్టాలని అర్థం చేసుకోలేరు. గొప్పవాళ్లు తప్పుచేసినా తప్పుకాదు తనలాంటి బీదవాడు తప్పుచెయ్యకపోయినా తప్పే. దానికి కారణం తన ముఖంమీద కనబడే దరిద్రమే, అదే అందరికీ ఇంత లోకువనిస్తోంది. ఆలోచిస్తున్నకొద్దీ వేడెక్కిపోతోందతని మెదడు. కానీ తన్ని ఈ ఆపదనుంచి గట్టెక్కించేదారి మాత్రం కనపడటంలేదు. ఏం తోచక లేచినిలబడ్డాడు. గడియారంవైపు చూసుకున్నాడు. ఎనిమిది కావస్తోంది. నెమ్మదిగా బయలుదేరాడు. కొద్దిసేపటికి మేనేజర్ ఇంటి ముందున్నాడు. సుందర్ నగర్‌లోని రెండంతస్తుల పెద్దభవనం గేటు వద్దకువెళ్ళిన ఉపేంద్రరావు గేటు తీసి లోపలికెళ్ళడానికి తటపటాయిస్తూ రెండు నిమిషాలపాటు నిలబడ్డాడు. ఇంతలో అల్సేషియన్ కుక్క పెద్దగా మొరుగుతూ గేటు దగ్గరకొచ్చి పైకి దుమకడంతో రెండడుగులు వెనక్కి వేసి, "నీకూ నేనంటే లోకువాతల్లీ" అనుకున్నాడు. ఇంతలో నౌకరువచ్చి "ఎవరు కావాలి?" అని అడగడంతో "మేనేజర్ కోస"మని చెప్పగానే ఎగాదిగా అనుమానంగా చూసి గేటుతీసి కుక్కనికట్టి, వరండాలో వున్న పేము కుర్చీ చూపించి కూర్చోమన్నాడు.

లోపల హాల్లో మిత్రులెవరితోటో మేనేజర్ గారు మాట్లాడుతున్నారు. నవ్వులతో పాటు, లోపల గ్లాసుల చప్పుళ్ళు, ప్లేట్ల చెమ్చాలచప్పుళ్ళు టక, టకా గణ గణా వినబడుతున్నాయి. "ఒద్దొద్దు" అంటున్నా వినకుండా కొంచెం పోసుకోండంటూ కొంచెం వేసుకోండి అంటూ బలవంతంగా తాగిస్తూ, తినిపిస్తున్నారు. "బాగా తాగిస్తున్నారు. కారు నడపాలి" అంటున్న ఆడగొంతుకతో "ఇది ఫారిన్‌దండీ మీవారికేం ఫరవాలేదు" అంటూ జవాబిస్తున్న మేనేజర్ గొంతు వినిపించింది. వారి మాటల్ని బట్టి, హాస్యాన్ని బట్టి, వారు సేవిస్తున్నదేమిటో గ్రహించగలిగాడు. ఒక్క రోజులో వందల్ని, వేలనీ మంచి నీళ్ళల్లా ఖర్చు చెయ్యగలడు. కానీ ఒక్క బీదవాడి గుండెల్లో బాధని అర్థం చేసుకోలేడీ దుర్మార్గుడు. ఇదంతా వీడి కష్టార్జితమా? పెద్ద న్యాయమూర్తిలాగ మహా పతివ్రతలాగ మాట్లాడుతాడు" అనుకున్నాడు మనసులో.

వచ్చిన అతిధులు వెళ్ళిపోవడానికి లేచారు. పురుషోత్తమరావూ, భార్యా గేటుదాకా వెళ్ళి వారిని సాగనంపి వచ్చారు. లోపలికెళ్తున్న పురుషోత్తమరావుగారిని చూడగానే లేచి నిలబడ్డాడు. ఉపేంద్రరావుని చూడగానే ముఖాన్ని చిట్లించి 'ఏమి'టన్నట్లు చూసాడు.

అంతదాకా తనలో తను పడుతున్న సంఘర్షణంతా కన్నీళ్ళ రూపంలో బైటికొచ్చింది. అత్మగౌరవాన్ని చంపుకొని అతని పాదాల్ని పట్టుకొని ఏడవడం ప్రారంభించాడు. రెండడుగులు వెనక్కి వేసిన పురుషోత్తమరావు అతనివైపు తీక్షణంగా చూసాడు. ఉపేందర్‌రావు తన పరిస్థితినంతా వివరించి, తను దొంగని కానని చెప్పి, ఎలాగయినా తననీ ఆపదనుంచి గట్టెక్కించమని ప్రాధేయపడసాగాడు.

"చూడు ఉపేంద్రరావు? ఇలాంటివన్నీ ఎలా నమ్మడం? రూపాయా? రెండా? ఇంత సొమ్ము కంపెనీది ఎవరు కడతారు? అంత అనుభవంలేని వాడిని ఈ ఉద్యోగంలో ఎందుకు చేరావు? నీవు నిజాయితీపరుడివో, దొంగవో ఎవరికి తెల్సు? ఇందులో నేనేం చెయ్యగలను చెప్పు. ఆ డబ్బు కట్టకపోతే నేను కంపెనీ యాజమాన్లకి సంజాయిషీ ఇచ్చుకోవాలి. తప్పునీదే, నువ్వే బాధ్యుడివి నేనేం చెయ్యలేను. నువ్వే ఏదో దారి చూసుకో" అంటూ లోపలికెళ్ళిపోయాడు.

అత్మాభిమానాన్ని కూడా చంపుకుని మేనేజర్ కాళ్ళు పట్టుకున్నాడు. అదీ నిష్ప్రయోజనమైంది. ఇంక లాభం లేదు ఆపుకోలేని దుఃఖం ముంచుకొస్తోంది ఆ వెనక ఆవేశం. కోపం, కసి, పౌరుషం అన్నీ ఏకమై తనని నిలవనియ్యటం లేదు. మేనేజర్‌ని కాల్చి చంపెయ్యాలన్నంత కోపం, కసి నిమిష నిమిషానికి పెరిగిపోతోంది. 'దొంగనిట దొంగని వీడికి దొంగకానని తెలియనప్పుడు దొంగనని ఎలా అనగలుగుతున్నాడు?' పదే పదే అతని నోట ఆమాట వినడం తనకి కంపరంగా ఉంది. ఏ అధికారంతో తన్నామాట అనగలుగుతున్నాడు? మేనేజర్నన్న పొగరు, అహంతప్ప అనుకుంటూ పళ్ళు పిండుకుంటూ ఆఖరిసారిగా గుండెలనిండా ఊపిరి పీల్చుకొని వదిలి గేటు తీసుకుని బైటకొచ్చేశాడు. పగబట్టిన త్రాచుపాములా అతని శరీరమంతా కక్షతో బుసకొట్టసాగింది. ఇన్ని మాటలన్న అతన్నేనా చంపాలి లేదా ఇన్నిమాటల్ని పడ్డ నేనన్నా చావాలి త్రాచుపాము పగకూడా ఇలాంటిదే కదా అనుకున్నాడు.

బస్‌స్టాండులో బస్ ఎక్కాడు కరోల్ బాగ్‌వైపుకా బస్సువెళుతోంది.

తనుండేది దేవ్‌నగర్‌లోనే. ఇంటికెళ్ళాలనిపించటం లేదు. మధ్యలో రవీంద్రరంగశాల దగ్గర దిగి నడవ సాగాడు కరోల్‌బాగ్ బజారమ్మట నడుస్తుండగా "చక్కూ భాయ్ చక్కూ" అంటూ ఓ కుర్రాడు ఎడంచేతిలో కొన్ని కత్తుల్ని పట్టుకుని, కుడిచేతిలో రెండు కత్తుల్ని టక టక లాడిస్తూ ఉపేంద్రరావుకి అడ్డం నిలబడ్డాడు. ఓ నిమిషం ఆగి మంచి పదునుగా వున్న ఓ మడత చాకుకొని "నీకు నాదో మేనేజర్‌దో రక్తాన్ని రుచి చూపిస్తా" అంటూ మడిచి జేబులో వేసుకున్నాడు.

"కత్తులు కొంటున్నా వేమిట్రోయ్" అంటూ మిత్రుడు పార్వతీశం ఎదురొచ్చి నవ్వుతూ పలకరించాడు. పరాకుగా ఉన్న ఉపేంద్రకి ఆపలకరింపు ఖంగారూ, గాబరానీ కలిగించింది. వెర్రిముఖంకేసి ఏమీ సమాధానమివ్వకుండా తలొంచుకున్నాడు. అది చూసి గ్రహించిన అతన్ని పార్వతీశం కారణమడిగాడు. అంత దాకా తనలో అణిగివున్న బాధనంతా అతనితో చెప్పుకొని ఏదన్నా ఉపాయం చూడమని ప్రాధేయపడసాగాడు.

పార్వతీశం ద్వారా ఉపేంద్రరావుకా ఆఫీసులో ఉద్యోగం వచ్చింది. విషయాన్నంతా విన్న పార్వతీశం క్షణంసేపు నివ్వెరపోయి అతన్ని చూసి మౌనంగా తలొంచుకుని నడవసాగాడు. అతని దగ్గర నుంచి కూడా ఎటువంటి జవాబూ రాకపోవడంతో "వస్తారా పార్వతీశం" అని పక్కసందులోకి వెళ్ళిపోయాడు. వెళ్తున్న అతన్నే చూస్తూ ఓ నిట్టూర్పు విడిచాడు పార్వతీశం.

ఇంట్లో తల్లితండ్రులకెట్టి అనుమానం కలగకుండా ఆ రాత్రి గడిపాడు ఉపేంద్ర. మర్నాడు మామూలుగా ఆఫీసువేళకి తయారయి బయలుదేరాడు. ఆఫీసు లోపలికెళ్తున్న అతనికి మేనేజర్ కారు దిగుతూ కనబడ్డాడు. వెనక్కి తప్పుకోవాలన్న అతని ప్రయత్నం విఫలమయింది. "ఏమోయ్ ఏం చేసావ్" అన్నాడు డోర్ లాక్ చేస్తూ. "ఏం చేస్తావో రాత్రిలోగా తెలుస్తుంది" అని మనసులో అనుకుంటూ వెనక్కి తిరిగి విసురుగా బైటికొచ్చేసాడు.

ఇంతలో పార్వతీశం ఎదురొచ్చి "ఒరేయ్ ఉపేంద్ర అలా కేన్‌టీన్‌కెళ్దాం రారా అంటూ చెయ్యిపట్టుకుని లాక్కెళ్ళాడు. రెండు టీలు ఆర్డరిచ్చి మూల వున్న బల్లమీద కూర్చున్నారు. "ఏం నిర్ణయించావురా అన్నాడు టీ తాగుతూ. అసలే మేనేజర్ పలకరింపుకి ఉడికిపోతున్నట్లు వున్న అతని శరీరం పార్వతీశం మాటలతో మరీ ఉడకసాగింది. పుండుమీద కారం జల్లినట్లయి తలెత్తి అతన్ని

కోపంగా చూసి తలదించుకున్నాడు. కోపంతో ముఖం ఎర్రబడింది. "చెయ్యని నేరానికి శిక్షననుభవించేకంటే నేరం చేసి శిక్షననుభవించటం మంచిదని నిర్ణయించుకున్నా" అన్నాడు వీలయినంత నెమ్మదిగా.

"ఏదన్నా బాగా ఆలోచిస్తే ఉపాయం తడుతుంది. నేనూ ఏదన్నా మార్గం ఆలోచిస్తా పద" అంటూ లేచాడు. "నువ్వూ నాలాంటి దరిద్ర నారాయణుడివేరా నువ్వేం మార్గం చూస్తావురా ఫూల్" అనుకొంటూ పేలవంగా నవ్వి తనతోవని తను వెళ్ళిపోయాడు.

సాయంకాలం దాకా రోడ్లమ్మట తిరుగుతూ ఆలోచిస్తూనే వున్నాడు. ఎక్కడికి వెళ్తున్నాడో తనకే తెలీదు. తనకే తెలియకుండా, తన మనస్సుతో ప్రమేయం లేకుండా కాళ్ళు ఎటు నడిపిస్తే అటల్లా నడిచివెళ్తున్నాడు. చీకటి పడింది. స్ట్రీట్ లైట్లు పట్టపగల్లా వెలుగుతున్నాయి. టైము చూసుకున్నాడు. గబగబా నడవడం ప్రారంభించాడు. ఇంతలో వెనుకనుంచి గబగబా వస్తున్న బూట్లచప్పుడు వినపడింది. వెనకనుంచి ఎవరో వచ్చి తన భుజాలమీద చేతులేసి తనవైపు తిప్పుకున్నారు. ఎదురుగా పార్వతీశం!! స్పృహ వచ్చిన వాడిలా చుట్టూ పరిశీలించి చూసాడు. తను మేనేజర్ ఇంటి కెళ్ళే వీధి మొదట్లో వున్నాడు. తొట్రుపాటుగా పార్వతీశాన్ని చూసాడు. వీడికి నా మనసులోని ఉద్దేశ్యం తెలిసి నన్ను వెంటాడటం లేదుకదా" అని ఖంగారుగా అతన్ని చూసాడు. దడ, వణుకు ప్రారంభయయింది. వెర్రివాడిలా అతన్ని చూడటం ప్రారంభించాడు. తనకింత ధైర్యం, సాహసం, తెగింపు ఎలా వచ్చాయో తనకే అర్థం కాక ఆశ్చర్యపోసాగాడు.

"ఒరేయ్! రారా నీ కష్టాలు గట్టెక్కాయి ఇంద ఈ చెక్కు తీసుకుని వెళ్ళు. రేపుకేష్ చేసి అక్కడికక్కడే బ్యాంకిలో కట్టేసిరారా! ఇందరా అదృష్టవంతుడిరా" అంటూ అతని జేబులో ఓ కవరుంచి వెళ్ళిపోయాడు పార్వతీశం.

ఆనందం పట్టలేని ఉపేంద్ర ఉక్కిరిబిక్కిరవసాగాడు భూమి మీదనుంచి ఆకాశంలోకి ఎగిరిపోతున్నట్లుందతని శరీరం. రెండు రోజులుగా పడుతున్న యాతన, మనస్థాపం ఓ పీడకలలా చెదిరిపోయింది. వెంటనే మనస్సు పశ్చాత్తాపంతో కుంగిపోయింది. తన చెడు ఆలోచనలకి సిగ్గుపడి బాధపడసాగాడు. నమ్మలేని నిజం, ఆనందం, పశ్చాత్తాపం పోటీపడి ఆనందమే

గెల్చింది. గాలిలో తేలిపోతున్నాయతని ఆలోచనలు. సంతోషంతో ఊగిపోసాగాడు. "అసలు మేనేజర్ తప్పేముంది. డబ్బు దొంగిలించింది ఒకడైతే మధ్యన మేనేజర్‌ని చంపడమెందుకు?" అని బాధపడసాగాడు. సిగ్గుతో తలెత్తలేకపోయాడు. "వస్తారా" అన్న పార్వతీశం మాటలకి ఈ లోకంలోకి వచ్చి అతని చేతులు పట్టుకుని వందసార్లు థేంక్సు చెప్పాడు.

మర్నాడు పదిగంటలకి బయలుదేరి చాందినీ చౌక్‌కి చేరాడు. జేబులో కవరుందో లేదో అని తడుముకుని చూసుకున్నాడు. ఇంతదాకా ఆనందంలో కవరులోని చెక్కు చూసుకోనేలేదన్న సంగతి గుర్తొచ్చి, జేబులోని కవరు తీసాడు. అది అంటించి వుంది చింపి చెక్కు బైటికి తీసాడు. చెక్కుకాదు డ్రాఫ్టు పదివేలకి తనపేరే రాసివుంది. కింద సంతకం చూసాడు. ఆశ్చర్యం? అది మేనేజర్ పురుషోత్తమరావుదే!! వెనక చిన్న చీటీ వుంది.

"డియర్ ఉపేంద్రరావ్! నువ్వు నిజాయతీ పరుడివని నాకు తెలుసు. అయినా ఉద్యోగధర్మానికి కట్టుబడి ఆ సమయంలో నలుగురిలో నీతో అలా ప్రవర్తించక తప్పలేదు. నీ కష్టాలని ఎరిగిన తోటి మానవుడిగా నేను నీకు చేస్తున్న ఈ సహాయాన్ని కాదనవని నమ్ముతున్నాను ఈ డబ్బు ఆఫీసు ఎక్కవుంటులో జమచేసి, మళ్ళీ నీ ఉద్యోగం చేసుకో. నా వృత్తి ధర్మం కోసం నేను అందరిలో అలా ప్రవర్తించినందుకు నన్ను అపార్థం చేసుకోకు. ఆఫీసులో అంతా నీలాంటి వాళ్ళే వుండరు. ఆనాడలా ప్రవర్తించి వుండకపోతే రేపు మరొకడు మరో నాటకం ఆడి, నిన్ను మన్నించినట్లే తన్ని క్షమించమంటాడు.

అది నా ఉద్యోగధర్మం. ఇది మానవధర్మం - సదా నీ శ్రేయస్సును కోరే నీ మేనేజర్ -

పురుషోత్తమరావు"

ఆ ఉత్తరాన్ని చదివిన ఉపేంద్రరావు మనస్సు ఆర్ద్రమయింది. కన్నీటి బొట్లు టప, టపా రాలాయి.

**(13.1.1984 ఆంధ్రసచిత్రవారపత్రిక)**